క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



గుడివాడటౌన్(నందివాడ): మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందుతుందని ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆహారం రుచిగా ఉందని, తృప్తిగా భోజనం చేస్తున్నామని విద్యార్థులు తెలిపారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూప్రకారం ఖచ్చితమైన కొలతలతో ఆహారం సిద్ధం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

14న ముగ్గుల పోటీలు

కూచిపూడి(మొవ్వ): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం కూచిపూడిల సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు తెలిపారు. సంజీవని వైద్యాలయంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి పోటీలను ప్రారంభిస్తామని, 15 ఏళ్లు పైబడిన మహిళలు పాల్గొనాలని ఆయన కోరారు.

వాకర్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని కృష్ణమందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం రాత్రి అంతర్జాతీయ అధ్యక్షుడు వి.మురళీ మోహన్‌రావు, జిల్లా గవర్నర్(202) రామలింగరాజులు నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు అర్జా ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు పర్వతనేని చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారిగా చింతా దుర్గా రామకృష్ణ, 9 మంది ఉపాధ్యక్షులు, ఇతర కార్యవర్గంచే ప్రమాణం చేయించారు.

రేపు త్యాగరాజ స్వామి ఆరాధనా మహోత్సవాలు

గుడివాడటౌన్: శ్రీ త్యాగబ్రహ్మ వైభవ ప్రకాశ సభ, ఉపద్రష్ట ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు శ్రీ త్యాగరాజస్వామి 176వ ఆరాధనా మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట సత్రం నందు జరిగే కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరీదేవి దేవస్థానం నుంచి ఉంఛవృత్తి ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక పూజలు, ములకట్ల బ్రహ్మానందశాస్త్రిచే త్యాగరాజ కీర్తన వైభవం, ప్రసంగం, బృందగానాలు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పాముకాటుతో కౌలు రైతు మృతి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): పాముకాటుకు గురై కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి కౌలు రైతు మసిముక్కు రాధాకృష్ణ(38) కౌలుకు చేస్తున్న మినుము పొలంలో మందు పిచికారీ చేస్తుండగా పాము కాటు చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లారు. పీహెచ్‌సీ వైద్యులు రాధాకృష్ణకి పాము విరుగుడుకు ఇంజెక్షన్లు చేశారు. మెరుగైన వైద్యం కోసం గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులు అప్పగించారు. ఈ మేరకు గుడివాడ అవుట్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

బస్టాండ్ స్థలం పరిశీలన

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ప్రధానసెంటర్‌లో ఉన్న బస్టాండ్ స్థలాన్ని ఏపీఎస్‌ఆర్టీసీ రీజనల్ మేనేజర్ గద్దే నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. బస్టాండ్ స్థలాన్ని పరిశీలించటంతో పాటు గ్రామస్తులతో ముచ్చటించారు. 12 సెంట్ల స్థలం ఆర్టీసీకి ఉందని, దీని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆర్‌ఎంను కోరారు. ఉయ్యూరు డిపో మేనేజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కైకలూరు: గ్రామంలో శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించి కంచె వేశారని ఫారెస్టు రేంజర్ జె.శ్రీనివాసరావుకు నత్తగుళ్లపాడు సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన నబిగారి రాంబాబు అనే వ్యక్తికి 2.75 ఎకరాల చేపల చెరువు ఉందన్నారు. ప్రతి ఏటా ఆక్రమించుకోవడం వల్ల నేడు ఆ చెరువు విస్తీర్ణం ఐదెకరాలకు చేరిందన్నారు. పైగా చెరువు చుట్టూ కంచెను నిర్మించాడన్నారు. కంచెను తొలగించి, ఆక్రమణ భూమిని గ్రామానికి అప్పగించాలని అటవీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదును సర్పంచ్ అందించారు.

ప్రజా సంకల్పయాత్ర.. చారిత్రాత్మక ఘట్టం

- ఎమ్మెల్యేలు డీఎన్నార్, కైలే
- వాడవాడలా సంబరాలు

కైకలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చేసిన ప్రజా సంకల్పయాత్ర ఓ చారిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అభివర్ణించారు. ప్రజా సంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కైకలూరు, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల వ్యాప్తంగా వాడవాడలా సోమవారం సంబరాలు నిర్వహించారు. కైకలూరు సంతమార్కెట్, కలిదిండి సెంటర్లలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద సోమవారం కేక్‌లను కట్ చేసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అనే నినాదంతో 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను నేరుగా వైఎస్ జగన్ తెలుసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఏఎంసీల చైర్మన్లు ఐనాల బ్రహ్మాజీరావు, దండే పుష్పలత, వైస్ చైర్మన్లు కొండ రాజు, రవికుమార్, సర్పంచ్‌లు దానం మేరీ నవరత్నకుమారి, మసిముక్కు మారుతీప్రసన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు రామారావు, కల్యాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శివాజీ, రమేష్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు బలరామరాజు, ఆనందకుమార్, నాయకులు గొట్రూ పాట్రిక్‌పాల్, చాంద్ బాషా, నీలపాల భోగేశ్వరరావు, కూనవరపు సతీష్, హమీద్, నిమ్మల సాయి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముదినేపల్లి మండలంలో..

ముదినేపల్లి రూరల్: వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ప్రజాసంకల్ప పాదయాత్ర చేయడంతోనే నేటి నవరత్నాలు ఆవిర్భవించాయని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, కోమటి విష్ణు వర్ధన్, శీలం రామకృష్ణ, సాక్షి సాయి, రాచూరి కుమార్, షేక్ గౌస్‌బేగ్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.



కలిదిండి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు



వానపాములలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కైలే, ఎంపీపీ గోగం సురేష్ తదితరులు



గుడివాడలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మండవల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు

మండవల్లి మండలంలో..

మండవల్లి: స్థానిక సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేశారు. నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చుతోందని కొనియాడారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, బేతపూడి యేసోబురాజు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, మెండా సురేష్, బుంగా రాణి, వలంటీర్లు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలకు నిదర్శనం సీఎం వైఎస్ జగన్

గుడివాడటౌన్: తన తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు అలుపెరుగని పోరాటం చేసిన మహాయోధుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజా సంకల్ప పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించారు. తొలుత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలు అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తండ్రి మాట నిలబెట్టేందుకు ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రజల్లోకి వెళ్లి నేను విన్నాను.. నేను ఉన్నాను అనే నినాదంతో సుదీర్ఘ పాదయాత్ర చేశారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వారి విశ్వాసాన్ని పొంది విజయ పరంపరలో భాగంగా 151 సీట్లు గెలిచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిలిచిన గొప్పనాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మాజీ కౌన్సిలర్లు మాదాసు వెంకట లక్ష్మి, శ్రీనివాస చక్రవర్తి, నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, వెంపటి సైమన్, అల్లం రామ్మోహన్, నరేంద్ర, నయనవరపు శేషుబాబు, మూడెడ్ల ఉమ తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో కైలే ఆధ్వర్యంలో వేడుకలు

వానపాముల(పెదపారుపూడి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తి కావటంతో మండలంలోని వానపాముల గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానుల వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ప్రచారం చేసి గెలుపొందారన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన వాగ్దానాలు కంటే ఎక్కువ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైస్ ఎంపీపీ పానుగుమాటి రజిని, గ్రామ సర్పంచ్ పాతూరి రమేష్, పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు పల్లా అరవింద్, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, నాయకులు లంకపల్లి రాజేష్, పడాలి రామారావు, పాతూరి సాల్మన్, ఏలీయా పాల్గొన్నారు.



కైకలూరు సంతమార్కెట్ వద్ద ఎమ్మెల్యే డీఎన్నార్ ఆధ్వర్యంలో వేడుకలు

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



వానపాములలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే, నాయకులు



కొరగుంటపాలెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యేలు కైలే, డీఎన్నార్

వానపాముల(పెదపారుపూడి): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల పక్షపాతిగా, సంక్షేమ సారథిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వానపాముల ఎస్సీ ఏరియాలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పేదలకు ప్రభుత్వం అందించిన పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. హౌసింగ్ రుణాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అదేశించారు.

98 శాతం హామీల అమలు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో అమలు చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలన మళ్లీ రావాలని ప్రతి గడపలో ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం ఒక్క జగన్‌దేనన్నారు. ఎంపీపీ గోగం సురేష్, వైస్ ఎంపీపీ పానుగుమాటి రజిని, పామర్రు మార్కెట్ యార్డు డైరక్టర్లు చీకుర్తి వరప్రసాద్, గోళ్ల వెంకటేశ్వరరావు, చేబ్రోలు సుజాత, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షులు పల్లా అరవింద్, తుమ్మల కోటేశ్వరరావు, సర్పంచ్‌లు పాతూరి రమేష్, పుణుకొల్లు శివరామప్రసాద్, ప్రత్తిపాటి హర్షవర్ధన్, గోళ్ల సోమేశ్వరరావు, నాయకులు లంకపల్లి రాజేష్, ఏలిసి డేవిడ్‌రాజు, ఎం.ఎలీయా, సాల్మన్, పడాలి రామారావు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణ పనులకు రూ.50 వేలు అందజేత

మండలంలోని వానపాముల గ్రామంలో ఉన్న పెంతుకోస్తు చర్చికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రూ.50 వేలు నగదును చర్చి ఫాదర్ సద్గుణరావుకు అందజేశారు. గతంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గ్రామం వచ్చిన సమయంలో చర్చి నిర్మాణ పనులు వితరణ నగదు ఇవ్వాలని స్థానికులు కోరారు. ఈ మేరకు గడప గడపకు వచ్చిన ఎమ్మెల్యే నగదును అందించటంతో గ్రామస్తులు, చర్చి సంఘ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

పేదలకు వరాలు.. నవరత్నాలు

ముదినేపల్లిరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న నవరత్నాలు పేదల పాలిట వరాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. ముదినేపల్లి మండలం కొరగుంటపాలెంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలను, ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. పథకాల అమలుపై ఆరా తీశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోన్న ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో ఉన్నతాశయంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని ధ్యేయంతో నవరత్నాలు అమలు చేస్తున్నారని చెప్పారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్..

ప్రధానంగా వ్యవసాయం, విద్య రంగాలతో పాటు మహిళల సంక్షేమానికి సీఎం విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ తెలిపారు. పార్టీ, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకే కేటాయిస్తూ మహిళా పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పథకాలు దీర్ఘకాలం కొనసాగాలంటే జగన్ దీర్ఘకాలం సీఎంగా కొనసాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నవరత్నాలతో ప్రజల నుంచి ప్రభుత్వానికి వెల్లువెత్తుతున్న మద్దతును చూసి ఓర్వలేని టీడీపీ, ఇతర పార్టీల నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ముఖ్యమంత్రిపై అభాండాలు వేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, సర్పంచ్ పేరే రామకృష్ణ సొసైటీ అధ్యక్షుడు అచ్యుత రాంబాబు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, ఈడే వెంకటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, శౌంతి నాగరాజు, బేతపూడి వెంకటరమణ, గూడపాటి వరప్రసాద్, బత్తుల చిరంజీవి, శేఖర్ పాల్గొన్నారు.



• సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కైలే

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎంను ఎమ్మెల్యే కైలే కలిసి పలు అంశాలపై చర్చించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జూదాలకు దూరంగా ఉండండి

కైకలూరు: సంప్రదాయాల ముసుగులో పండగ వేళ జరిగే జూద క్రీడలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు చెప్పారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో కలిదిండి పోలీసు స్టేషన్ వద్ద ఎస్‌ఐ మణికుమార్ నేతృత్వంలో నియోజకవర్గ స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. రూరల్ సీఐ వైవీవీఎల్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసు శాఖ క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్‌ఐ మణికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 40 జట్లు పోటీ పడుతున్నాయన్నారు. నగదు బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు ఆటలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, సర్పంచ్ మారుతీప్రసన్న, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నీలి సుమన్, ప్రజాప్రతినిధులు, పోలీసులు పాల్గొన్నారు.



కలిదిండిలో షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

క్రీడాకారులకు అభినందన

పామర్రు: అంతర జిల్లా పాలిటెక్నిక్ క్రీడల పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తమ్మా భాస్కరరెడ్డి తెలిపారు. స్థానిక సాయినగర్‌లోని కళాశాలలో విజేతలను సోమవారం అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.పుష్ప ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. 200 మీటర్ల పరుగు పందెంలో ఎస్.వర్షిత ప్రథమ స్థానం, షటిల్ డబుల్స్‌లో జె.అనూష, ఎస్.నాగేశ్వరీలు ప్రథమ స్థానం సాధించారన్నారు. బాలుర విభాగంలో జావలిన్ త్రోలో ఏ.సంజీవ్, బి.విజయకుమార్‌లు ద్వితీయ, తృతీయ స్థానాలు, షాట్ పుట్‌లో ఏ.సంజీవ్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులు మరింత ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. విజేతలను, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, ఆధ్యాపక బృందం అభినందించింది.



విజేతలతో ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, సిబ్బంది

అలరించిన ముగ్గుల పోటీలు

గుడివాడటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో వాసవీక్లబ్ వనితా విదర్భపురి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రథమ బహుమతి రిఫ్రిజిరేటర్, ద్వితీయ బహుమతి వెట్ గ్రైండర్, తృతీయ బహుమతి మిక్సీ, 7 కన్సోలేషన్ బహుమతులు విజేతలకు అందజేశారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తాతా రజినీకుమారి, జిల్లా ఇన్‌చార్జి పరిశె వాణిశ్రీ, పద్మలత, చీదెళ్ల లక్ష్మి, కటకం శ్రీ మహాలక్ష్మి, జె.సుధారాణి, గాయత్రి పాల్గొన్నారు.

● స్థానిక పెద్ద వీధిలో లవ్‌లీగైస్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు జరిపారు. 70 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విజేతలకు వైఎస్సార్ సీపీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, వి.అప్పారావు, తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను సత్యనారాయణ, సాంబశివరావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సందడి

కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌డీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందించారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌ప్రకాష్, అధ్యాపకులు జ్ఞానప్రసూనాంబ, సంధ్యారాణి, కుసుంద, సుజన్, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్రణాళిక గడువు పొడిగించాలి

పామర్రు: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్రణాళిక 10 ఏళ్ల కాల పరిమితి మార్చి – 2023తో ముగిస్తోందని, దీనిని మరో 10 ఏళ్లు పొడిగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు లాం తాంతియాకుమారి కోరారు. స్థానిక పాల శీతల కేంద్ర కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సబ్ ప్లాన్ అమలుకు ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించాలన్నారు. సబ్ ప్లాన్ ద్వారా అమలు చేస్తున్న పథకాల రూపకల్పనలో ఆయా వర్గాల ప్రజలను భాగస్వాములు చేయాలని చెప్పారు. రద్దు చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించడంతో పాటు కోనేరు కమిటీ సిఫార్సులను సక్రమంగా అమలు చేయాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పెదపూడి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు విక్రయించిన ధాన్యం నగదును వెంటనే జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సుబ్బారావు, శ్రీనివాసరావు, చెన్నయ్య, దాదా సాహెబ్, హైదర్, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడటౌన్: ఆర్టీసీ ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను తెలపడంతో పాటు ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. 99592 25464 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

జూదం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

మండవల్లి: సంక్రాంతి పండుగ నేపథ్యంలో చట్ట వ్యతిరేకంగా నిర్వహించే కోడిపందేలు, జూదం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్‌ఎస్ భాస్కరరావు, కో కన్వీనర్ టి.అప్పారావు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఏ.జనార్దనరావుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. గతేడాది ఈవిధమైన క్రీడలు నిర్వహించిన వారిని గుర్తించి నిఘా పెట్టి జూద క్రీడలను నివారించాలని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కైకలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట, అక్రమ మద్యం విక్రయాలు వంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.మురళీకృష్ణ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో సచివాలయ స్థాయిలో కమిటీల పనితీరుపై మండల పరిషత్ సమావేశ హాలులో ఆయన సోమవారం సమీక్ష చేశారు. ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు గ్రామాల్లో జాయింట్ యాక్షన్ కమిటీలు పనిచేస్తాయన్నారు. ఆయా గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. కలిదిండిలో తహసీల్దార్ తేజోమణి ఆధ్వర్యంలో కలిదిండి -2 సచివాలయం వద్ద ఎస్‌ఐ మణికుమార్, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

గుడ్లవల్లేరు: కౌతవరంలో వైఎస్సార్ బీమా పథకం కింద మృతుని కుటుంబానికి తక్షణ సాయం చేశారు. గ్రామంలో గోపిశెట్టి శ్రీమన్నారాయణ(56)కు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి చిన్ని చేతుల మీదుగా రూ.10 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం సోమవారం అందజేశారు. మిగిలిన ప్రభుత్వ సాయం త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవాలయ చైర్మన్ ఆరేపల్లి శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.శ్రీనివాసరావు, ఎఫ్‌ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.